క్లుప్తంగా

కళింగ వైశ్య సంఘం ఎన్నిక


అధ్యక్షుడు
జి.డి.ప్రసాద్


ఉపాధ్యక్షుడు
డాక్టర్ గుడ్ల బాబు

ఆమదాలవలస: పట్టణ కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన వ్యాపారవేత్త జి.డి.ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ గుడ్ల బాబు, కార్యవర్గ సభ్యులుగా పలువురు వ్యాపారవేత్తలను ఎన్నుకున్నారు. వీరికి పట్టణంలో వ్యాపారులు అభినందనలు తెలిపారు.

నేత్ర దానంపై అవగాహన


మాట్లాడుతున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కృష్ణారావు

పాతపట్నం: నేత్ర దానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి పాతపట్నం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఎస్.కృష్ణారావు అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా సీహెచ్‌సీలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. నేత్రాలు దానం చేయడం వల్ల మరణానంతరం కూడా నేత్రలు పని చేస్తాయన్నారు. కంటి వైద్యుడు శేషుబాబు, వైద్యులు అనిత, షిభాణి, షణ్ముఖరావు, చిన్నంనాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు


ఎంపీడీఓ కార్యాలయం వద్ద స్మార్ట్ మీటరు బిగిస్తున్న సిబ్బంది

నరసన్నపేట: ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు బిగిస్తున్నట్లు నరసన్నపేట ఏడీ ఇందిర శుక్రవారం తెలిపారు. అదానీ కంపెనీకి చెందిన ప్రతినిధులు వచ్చి స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో మీటర్లు బిగిస్తున్నారన్నారు. ప్రస్తుతానికి పది మీటర్లు వచ్చాయన్నారు. నరసన్నపేట ఎంపీడీఓ కార్యాలయంలో మొదట మీటరును బిగించామన్నారు. 500 యూనిట్లు పైబడి వాడిన వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించే అవకాశం ఉందన్నారు. నరసన్నపేట ఏఈ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

14 మందికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సునీత

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స శిబిరంలో 14 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు వైద్యులు సునీత, ప్రియాంక తెలిపారు. ప్రతీ శుక్రవారం కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. నెల రోజులపాటు ప్రతీరోజు సంబంధిత గ్రామానికి చెందిన వైద్య సిబ్బంది పర్యవేక్షిస్తారన్నారు. వీరితో పాటు తురకపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు నీతూ, లక్ష్మీదీప్ పాల్గొన్నారు.

లింగనిర్ధారణ నేరం


మాట్లాడుతున్న వైద్యాధికారి సుజాత

జలుమూరు: లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని అచ్చుతాపురం వైద్యాధికారి పూజారి సుజాత అన్నారు. శుక్రవారం కరకవలసలో లింగనిర్ధారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలు వద్దు అనడం కూడా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు అధ్యాపకుల బదిలీ

హిరమండలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన ఇద్దరు కాంట్రాక్టు అధ్యాపకులకు బదిలీ అయినట్లు ప్రిన్సిపాల్ పి.ఈ.ఎస్.పట్నాయక్ శుక్రవారం తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అధ్యాకులు బి.రాజేశ్వరరావు రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, మెకానికల్ అండ్ ఆటోమొబైల్ ఇంజినీర్ అధ్యాపకులు పి.శరత్‌బాబుకు విశాఖపట్నంలోని పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ అయిందన్నారు.

రైతన్నకు పెట్టుబడి భారం

- ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సగం రోజులు పూర్తి
- ప్రభుత్వం నుంచి అందని పెట్టుబడి సాయం
- అప్పుల కోసం తిప్పలు పడుతున్న రైతులు


తురుకపేట సమీపంలో పంట పొలాలు

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగు పెట్టుబడి పెరిగిపోతోంది. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తయ్యాయి. గతంతో పోల్చి చూస్తే ఈ ఏడాది పెట్టుబడి భారంగా మారింది. ట్రాక్టర్‌తో పొలం దుక్కిలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కలుపు నివారణ, కూలీల ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి వచ్చిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎదురుచూపులు..

గత ప్రభుత్వ పాలనలో రైతులకు పెట్టుబడి సాయం సకాలంలో అందేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పట్టించుకోవటం లేదు. ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పేరుతో రైతుకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయంగా అందిస్తామని చెప్పిన చంద్రబాబు.. అధికారం చేపట్టి మూడు నెలలు కావస్తున్నా సాయం అందివ్వలేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పేరుతో రైతులకు పెట్టుబడి సాయంగా రూ.2వేలు ఇప్పటికే జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఎలాంటి సహాయం అందివ్వలేదు.

పెరుగుతున్న అప్పులు..

పంట పెట్టుబడి కోసం రైతులు తమ వద్ద ఉన్న బంగారం తనఖా పెట్టి, హామీ పత్రాలు రాసిచ్చి అప్పులు చేస్తున్నారు. మరికొందరు రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కలుపు నివారణ మందులు... ఇలా పెట్టుబడి కోసం వ్యాపారుల వద్ద ఎక్కువ వడ్డీకి అరువు పద్ధతిలో తీసుకుంటున్నారు. పంట చేతికి అందివచ్చినప్పుడు ఆదే వ్యాపారులకు పంటను అమ్ముకుని డబ్బులు అప్పుతీర్చే పద్ధతిలో పత్రాలు రాసిచ్చి అరువు తెస్తున్నారు.

రైతు భరోసా వచ్చేది..



గతంలో పంట కాలం ప్రారంభం కాగానే గత ప్రభుత్వం పంట పెట్టుబడి కోసం రైతు భరోసా డబ్బులు బ్యాంకు ఖాతాలో వేసేది. ఆ డబ్బులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంట కోతలకు, కూలీల ఖర్చుల కోసం ఉపయోగపడేవి. ఎక్కువగా అప్పు చేయాల్సి ఉండేది కాదు. ఈ ప్రభుత్వం వచ్చి రైతులకు ఎలాంటి సాయం అందించడం లేదు.

– పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

అప్పలు చేయాల్సి వస్తుంది



పంట పెట్టుబడి కోసం బ్యాంకుల్లో, ప్రైవేటు వ్యాపారులు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయడం, అరువు తీసుకోవడం తప్పడం లేదు. పంట కాలంలో గతం కంటే పెట్టుబడి పెరిగిపోతోంది. ఎరువులు, పురుగు మందులు, కూలీల కూలి రేట్లు గతం కంటే ఎక్కువగా పెరిగిపోయాయి.

– ఎన్.వైకుంఠరావు, రైతు, మిరియాపల్లి, ఎల్.ఎన్.పేట

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు



కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులకు పంట పెట్టుబడిగా ఇచ్చే అన్నదాత సుఖీభవ పథకం అమలు కోసం ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే రైతుల జాబితాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పిస్తాం. రైతులు విచక్షణా రహితంగా ఎరువులు, పురుగ మందుల వినియోగంచడం వల్ల లాభం కంటే నష్టం ఎక్కువగా ఉంటుంది.

– పైడి లతశ్రీ, ఏఓ, ఎల్.ఎన్.పేట

వ్యాధులు విజృంభిస్తున్నా చర్యలు శూన్యం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: గత కొన్ని రోజులుగా గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా అనేక వ్యాధులు పంజా విసురుతున్నాయని, ప్రభుత్వపరంగా చేపట్టే చర్యలు, రోగులకు అందించే సేవలు ఏమీ లేవని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అన్నిచోట్లా పారిశుధ్య లోపమే ప్రధాన కారణమన్నారు. చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడంలేదన్నారు. ఆస్పత్రుల్లో అత్యవసమందులు అందుబాటులో ఉండటం లేదని, గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం కనిపిస్తోందని, డెంగీ, మలేరియా, వైరల్ వంటి జ్వరాలతో బాధపడుతూ మరణిస్తున్న వారి సంఖ్య పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రోగులకు వచ్చే సాధారణ జ్వరం తగ్గించుకునే వైద్యం కోసం ఆస్తులు అమ్ముకునే దుస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చామని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వందలాది రోగాలకు వైద్యం అందామని, రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం ఆదుకుందన్నారు. మండలానికి రెండు పీహెచ్‌సీలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్లు, 104, 108 సర్వీసులు, ప్రతీ మూడు, నాలుగు నెలలకు ఒకసారి గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటు వంటి ఎన్నో ప్రజాసంక్షేమ నిర్ణయాలు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసే దిశగా నాడు–నేడుతో అన్ని సౌకర్యాలూ కల్పించారన్నారు. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక కొత్త మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో 17 కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని వివరించారు. చంద్రబాబు పాలనలో జ్వరాలతో బాధపడుతూ మృతి చెందుతున్న బాధితుల జాబితా రోజురోజుకూ పెరిగిపోతుందన్నారు. సామాన్య ప్రజలకు జ్వరానికి వైద్యం అందివ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చటంతో పాటు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందివ్వాలని, ప్రభుత్వపరంగా మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కక్షసాధింపు చర్యలు మానుకుని ప్రజాసంక్షేమం కోసం పని చేయాలన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు

మెళియాపుట్టి: ఉపాధి హామీ పనులు పారదర్శకంగా నిర్వహించాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో నిర్వహించిన 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిలో పాల్గొన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరాలలో పలు శాఖలలో చేసిన పనులకు సంబంధించి ఆగస్టు 16 నుంచి ఈ నెల 29 వరకు మండలంలోని 37 గ్రామ పంచాయతీలలో ఎస్ఆర్పీ రామారావు, పది మంది డీఆర్పీలు కలిసి గ్రామాల్లో రూ.18.86 కోట్ల ఖర్చుకు సంబంధించిన పనులపై తనిఖీలు నిర్వహించారు. ప్రజావేదికలో వివరాలను పీడీ సమక్షంలో వెల్లడించారు. కొన్ని గ్రామ పంచాయతీలలో మస్తర్లలో దిద్దుబాట్లు, కొలతల్లో తేడాలు, మొక్కలు చనిపోయినట్లు తనిఖీ బృందం సభ్యులు గుర్తించినట్లు తెలిపారు. ఎన్ఐసీ సర్వర్‌లో నూతనంగా పనిచేస్తున్న మేట్లకు అవగాహన లేకపోవడంతో దిద్దుబాట్లు జరిగాయని పలువురు క్షేత్ర సహాయకులు తెలిపారు. పనులు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, తప్పులు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని పీడీ హెచ్చరించారు. ఇల్లాయిపురం పంచాయతీలో చిన్నపిల్లలు పనికి వెళ్తున్నట్లు సర్పంచ్ గవిరేసు పీడీ దృష్టికి తీసుకెళ్లారు. దానిపై విచారణకు ఆదేశిస్తామన్నారు. మేట్లతో పనులు చేసే సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్లు కొలతల నమోదు ఎప్పటికప్పుడు చేయాలని, పని ప్రదేశాలలో బోర్డులు నిర్మించాలని, 100 రోజుల పని దినాల కల్పనకు సిబ్బంది దృష్టి పెట్టాలన్నారు. 17వ విడతకు సంబంధించి ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, ఐటీడీఏ, సోషల్ ఫారెస్ట్ శాఖలలో జరిగిన పనులకు సంబంధించి తనిఖీలు జరిగినట్లు తెలియజేశారు. ఏపీడీ మురళీకృష్ణ, హెచ్ఆర్ మేనేజర్ శ్రావణ్, తహసీల్దార్ హనుమంతరావు ఎంపీడీఓ చంద్రకుమారి, ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ, మండల నాయకులు ఉదయ్‌కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన


పాతపట్నం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు


కొత్తూరు: డీటీకి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు


నరసన్నపేట: తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: కేంద్ర ప్రభుత్వం కొత్తగా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ తీసుకువచ్చిందని, దీనికి ఉపాధ్యాయులు వ్యతిరేకమని పాతపట్నం యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.మోహన్‌రావు, జి.కవీశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా పాతపట్నం తాలుకా యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. యూపీఎస్, సీపీఎస్‌లు ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయం కావన్నారు. ఓపీఎస్ సాధన కోసం ఉపాధ్యాయులందరూ కలిసి ఉద్యమం చేపడతామన్నారు. అనంతరం తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసన తెలిపినవారిలో ఎం.శంకరరావు, ఎం.షణ్ముఖరావు, కె.లచ్చన్న, ఎస్.మన్మథరావు, పి.రవీంద్ర, దుర్గారావు, సోమేశ్వరరావు, ఎ.రమేష్ కుమార్, ఎ.గోపాల్, రత్నకుమార్, రామారావు, రంజీత్, పొట్టన్న తదితరులు ఉన్నారు.

యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ఆమోద యోగ్యం కాదు..

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ఆమోదయోగ్యం కాదని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు దండు ప్రకాశరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ప్రకాశరావు, జిల్లా నాయకుడు బోద శ్రీను మాట్లాడుతూ ఓపీఎస్‌ను తీసుకువచ్చే వరకు పోరాటం సాగిస్తామన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక డీటీకి అందజేశారు. మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

నరసన్నపేట: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యూపీఎస్, సీపీఎస్ విధానం ఉద్యోగులకు సమ్మతం కాదని, ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం నరసన్నపేటలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి నరసన్నపేట, పోలాకి మండలాల ఉపాధ్యాయులు వినతిపత్రం అందించారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోరాడ వైకుంఠరావు, కార్యవర్గ సభ్యులు దమయంతి, ఆదినారాయణ, ఉమాభాస్కర్, రాజేష్, తిరుమల, పోలాకి మండలం ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.ధర్మారావు ఉన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే


దువ్వారివీధిలో సర్వే నిర్వహిస్తున్న డీఎంఓ, వైద్య సిబ్బంది

పాతపట్నం: సీజనల్ వ్యాధులు, ప్రాణాంతక వ్యాధులకు మన చుట్టూ ఉన్న దోమలే కారణమని జిల్లా మలేరియాధికారి (డీఎంఓ) వై.కె.శ్రీనివాసరావు అన్నారు. పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని దువ్వారివీధిలో శుక్రవారం చేపట్టిన ఇంటింటా సర్వేను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ వైద్య సిబ్బందితో కలిసి వెళ్లి జ్వరాల ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది పావని, ప్రవల్లిక, శాంతి, కమల పాల్గొన్నారు.

తరగతి గదిలో వర్షం నీరు


వర్షానికి తడిచిన గదిలో గోనెలపై కూర్చున్న విద్యార్థులు

సరుబుజ్జిలి: ఏమాత్రం వర్షం కురిసినా బప్పడాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదు. శ్లాబ్ పైపెచ్చులు పూర్తిగా ఊడి పడిపోతున్నాయి. శ్లాబ్ పైనుంచి వర్షంనీరు లీక్ కావడంతో తరగతి గదిలో కూర్చునేందుకు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని వినతి


ఎమ్మెల్యే రవికుమార్‌కు వితనిపత్రం అందజేస్తున్న మన్నయ్యపేట రైతులు

ఆమదాలవలస: పురపాలక సంఘం ఆరో వార్డు పరిధిలోని కాళింగ మన్నయ్యపేటలో ఆక్రమణకు గురైన చొక్కాకుల చెరువు సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు రైతులు వినతి పత్రం అందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎమ్మెల్యేను శుక్రవారం కలిశారు. గ్రామానికి చెందిన కొంతమంది చెరువును ఆక్రమించి వారి సాగులోకి తీసుకున్నారని వివరించారు. చెరువు దిగువన ఉన్న 80 ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇటీవల శ్రీకాకుళం రూరల్ మండలానికి చెందిన సర్వేయర్ల బృందం సభ్యులు వచ్చి సర్వే చేసి హద్దులు నిర్ణయించారని తెలిపారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వారిదే బాధ్యత అంటే వారిదేనని ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారన్నారు. వినతిపత్రం అందించిన వారిలో రైతులు కూన సుందరరావు, గురుగుబెల్లి రాజశేఖర్, అన్నెపు కృష్ణకాంత్, గురుగుబెల్లి కృష్ణమూర్తి, పైడి మోహనరావు, పాతిన వెంకటరమణరావు ఉన్నారు.

ఆడ పిల్లలను రక్షిద్దాం.. చదవనిద్దాం..

పొందూరు: బాలికా చట్టాలపై ఆడపిల్లలందరూ అవగాహన కలిగి ఉండాలని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ కుప్పిలి ప్రసన్న రాణి తెలిపారు. మండలంలోని లోలుగు గ్రామంలోని కేజీబీవీలో బాలికా చట్టాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలను రక్షిద్దాం.. చదవనిద్దాం అనే నినాదంతోపాటు వారి స్వీయ రక్షణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు. సురక్షిత స్పర్శ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, వరకట్న వేదింపులు, మానవ అక్రమ రవాణా, అత్యాచారాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలు, మహిళలు ఎటువంటి కష్టంలో ఉన్నా 100, 1098, 181, 112 హెల్ప్‌లైన నంబర్లకు సమాచారం అందించాలన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో వరలక్ష్మీ వ్రతం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జలుమూరు: శ్రీముఖలింగం ప్రధాన ఆలయంలో వారాహి అమ్మవారికి శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీవ్రతం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, పిండి వంటలు సమర్పించి మొక్కులు తీర్చారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పాల్గొన్నారు.

సత్యసాయి మందిరంలో ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న మహిళలు

నరసన్నపేట: స్థానిక మారుతీనగర్ సత్యసాయి బాబా మందిరంలో శుక్రవారం శ్రీసూక్త విధాన సహిత సాయి దీప లక్ష్మీ వైభవం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 108 మంది మహిళలతో అర్చకులు టీఎస్ఎన్ మూర్తి పూజలు చేయించారు. సత్యసాయి మందిరం వద్ద భక్తిభావం కనిపించింది. మందిరం కమిటీ సభ్యుడు ఎం.ఎల్.నాయుడుతోపాటు పలువురు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని వక్తలు పిలుపునిచ్చారు. వన మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, వివిధ కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


సరుబుజ్జిలి: మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న అధికారులు


నరసన్నపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మొక్కలు నాటుతున్న అధికారులు


ఎల్.ఎన్.పేట: కేజీబీవీలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

ఆమదాలవలస: ప్రజలు సహకరిస్తే నియోజవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తానని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. గతంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు గుర్తుచేశారు. అవి మళ్లీ ఇప్పుడు కొనసాగిస్తానన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారాని తమవంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. పలు విద్యా సంస్థలు ఏర్పాటు చేస్తామన్నారు.

తాగునీరు సరఫరా


తాగునీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

కొత్తూరు: మండల కేంద్రంలో శుక్రువారం మంచి నీటి ట్యాంక్ ద్వారా సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు తాగు నీరు పంపిణీ చేయించారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ఉండాలన్న ఆలోచనతోనే ట్యాంకు ద్వారా తాగునీటిని సరఫరా చేశారు.

రాజీయే రాజమార్గం


అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మణి

కొత్తూరు: సెప్టెంబర్ 14వ తేదీన నిర్వహించునున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. కోర్టులో శుక్రవారం ప్రీ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ రాజీకి అవకాశమున్న కేసులకు సంబంధించిన వాటిని లోక్ అదాలత్‌లో రాజీ అయ్యేందుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రధానంగా ప్రమాదాలు, గృహ హింస, ప్రామిసరీ నోట్, మనోవర్తి, క్రిమినల్, బ్యాంకు నగదు రికవరీ కేసులు రాజీ చేసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసేందుకు కొత్తూరు, బత్తిలి, హిరమండలం పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తూరు ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్, న్యాయవాదులు ఎం.అప్పారావు, వి.సుధాకరరావు, సి.హెచ్.రవి కిరణ్, జి.ఫల్గుణరావు, ఆర్.ఉమామహేశ్వరరావు, రాడ రాజు పాల్గొన్నారు